# యువ చైతన్యమే లక్ష్యం



కాలంతోపాటు సంపాదన వైపు పరుగు తీస్తున్న యువతలో దేశభక్తి.. ఆధ్యాత్మిక చింతన.. వ్యక్తిత్వ వికాసం పెంపొందించడం ద్వారా ఉత్తమ పౌర సమాజ స్థాపన సాధ్యం. నువ్వు తయారవుతూ మరొకరిని తయారు చెయ్ (బీ అండ్ మేక్)... నినాదంతో ఏర్పాటైనదే విశాఖ యువ మహా మండలి. నేటి యువతలో ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందించడంతో పాటు దేశం నాకేమిచ్చింది అనే భావన నుంచి దేశానికి నేను ఏమివ్వగలను అనే చింతనను పాదుకొల్పే దిశగా పయనిస్తోంది. వీరిని సామాజిక దృక్పథం వైపు నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తోంది వీవీవైఎం. మురళీనగర్‌లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులోని వివేకానంద ఆధ్మాత్మిక మందిరం వేదికగా వీరు తమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– మురళీనగర్


స్టడీ సర్కిల్‌లో యువకుల అధ్యయనం

ఆదర్శంగా విశాఖ వివేకానంద యువ మహామండలి

ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు వేదికగా కార్యక్రమాలు

### గ్రంథాలయం ఏర్పాటు


వివేకానంద లైబ్రరీ

వివేకానంద యువ మహామండలి సహకారంతో ఇక్కడ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. నాయుడు లక్ష్మీనారాయణ ఆర్థిక సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. పిల్లలు, యువకులు, మహిళలకు ఈ గ్రంథాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ప్రతి ఆదివారం యువకులు ఇక్కడి గ్రంథాలయంలో వివేకానందుడి బోధనలను చదివి అవగాహన పొందుతారు. ఉదయం వివేకానందుడి మండపంలో పూజ చేసి వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ రోజు తప్పనిసరిగా యువత పాల్గొంటారు.


వివేకానందుడి విగ్రహం వద్ద యువకుల నివాళి

### ఇద్దరు విద్యార్థులతో ప్రారంభమై...

1988 నవంబరు 6న ఏయూ ఇంజినీరింగ్ హాస్టళ్లలో వీవీవైఎం 'వివేకానంద స్టడీ సర్కిల్'గా ప్రారంభమైంది. అప్పటి నెల్లూరు వివేకానంద యువ మహామండలిని స్ఫూర్తిగా తీసుకుని దీన్ని ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ కోచింగ్‌కి నెల్లూరు వెళ్లిన ఇంకొల్లుకు చెందిన నాయుడు లక్ష్మీనారాయణకి నెల్లూరు యూనిట్ ప్రతినిధి తుర్లపాటి లక్ష్మీనారాయణరావు వివేకానంద యువ మహామండలి స్థాపనపై మార్గనిర్దేశం చేశారు. మొదట బ్లాక్ నంబర్ – 1లో ఇద్దరు విద్యార్థులతో ఏర్పాటైంది. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి చంద్ర శేఖర్, కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థి నాయుడు లక్ష్మీనారాయణ ఈ స్టడీ సర్కిల్‌ను ప్రారంభించారు. విశాఖపట్నం వివేకానంద యువ మహామండలిలో ప్రస్తుతం 400 మంది సభ్యులున్నారు. వీరిలో 150 మంది సభ్యులు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. విశాఖపట్నం వివేకానంద యువ మహామండలి అభివృద్ధికి వ్యవస్థాపక అధ్యక్షుడు నాయుడు లక్ష్మీనారాయణ విశేష కృషి చేశారు.


యువకుల, విద్యార్థుల యువ చైతన్య ర్యాలీ

### ఆధ్యాత్మిక చింతన పాదుకొల్పుతూ...

ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో వివేకానంద యువ మహామండలి, పార్కు నిర్వహణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పాదుకొల్పుతున్నారు. వినాయకుడు, శ్రీకృష్ణుడు, ఆంజనేయ స్వామి, దక్షిణామూర్తి, షిరిడీ సాయిబాబా, రామకృష్ణ పరమహంస, శారదాదేవి, ఆదిశంకరాచార్యులు విగ్రహాలు ఆధ్యాత్మికతను చాటుతున్నాయి. వివేకానంద యువ మహామండలి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామి వివేకానంద, రామకృష్ణ పరమహంస, శారదాదేవి, ఆది శంకరాచార్యులు జయంతి వేడుకలు, జాతీయ, రాష్ట్రీయ పర్వ దినోత్సవాలు సందర్భంగా పూజలు నిర్వహిస్తారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగా బృందంతో యోగా నిర్వహిస్తారు. ప్రతి ఏకాదశి రోజున రామనామ సంకీర్తన, శ్రీరామకృష్ణ ఆరాత్రికం, హనుమాన్ చాలీసా, గోవింద నామాలు, గీత, విష్ణు సహస్ర నామ పఠనం ఉంటుంది. రోజూ ఉదయం, సాయంత్రం గంటసేపు పెద్దలకు సత్‌గానం కొనసాగుతోంది. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మహిళలచే అన్నమయ్య సంకృతి కోలాటం నిర్వహిస్తారు. ప్రతి పౌర్ణమి రోజున సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ధ్యానం నిర్వహిస్తారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ పైమా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో యువత పాల్గొంటారు.


వివేకానంద మండపం

### వివేకానంద స్టడీ సర్కిల్...

వివేకానంద స్టడీ సర్కిల్‌లో యువత నేటి భారతదేశం ఉన్నతికి కృషి చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సర్కిల్‌లో యువత స్ఫూర్తి పొందే పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. స్వామీ వివేకానందుడి జీవిత చరిత్ర, వివేకానందుడి రచనలు, మహా మండలి పుస్తకాలు, విలువల సముపార్జన, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, భగవద్గీత, పురాణాలు, సనాతన ధర్మానికి సంబంధించిన వందలాది పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వివేకానంద స్టడీ సర్కిల్‌ను ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మురళీనగర్ సెక్టార్ – 3 ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు స్వామి వివేకానంద మండపంలో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ప్రతి శుక్రవారం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఆన్‌లైన్ స్టడీ సర్కిల్, ప్రతి ఆదివారం పెందుర్తిలోని హాస్టల్‌లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రతి ఏడాది జనవరి 12న జాతీయ యువజన దినోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. యువకులతో యువ చైతన్య ర్యాలీ నిర్వహిస్తారు. వివేక్ వలంటీర్ రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 23 వివేక్ స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి వందలాది మంది ప్రాణాలు కాపాడారు.


రక్తదానం చేస్తున్న యువకులు

### ఎంతో నేర్చుకున్నాం



విశాఖ వివేకానంద యువ మహా మండలిలో చేరిన తర్వాత జీవితంలో ఎంతో నేర్చుకున్నాం. నేను 12 ఏళ్లుగా వీవీవైఎంలో పని చేస్తున్నాను. యువకుల్లో చైతన్యం తేవడంతోపాటు వారి వ్యక్తిత్వ వికాసానికి కృషి జరుగుతోంది. మనిషి జన్మించిన తర్వాత తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలి. జీవితంలో ఉద్యోగం, ఫ్యామిలీ చాలా కీలకమైనవి. వీటిని సమన్వయం చేసుకుంటూ ఉన్నతంగా జీవించాలనేది ఇక్కడ నేర్చుకున్నాం.

– బి.అప్పలనాయుడు, గాజువాక, ఎల్అండ్‌టీ ఉద్యోగి

### సామాజిక బాధ్యత తెలుసుకోవాలి



నేటి యువత డబ్బు సంపాదన కోసం పరుగులు పెడుతున్నారు. డబ్బు సంపాదించడం మంచిదే. ఆ సంపాదనను తన కుటుంబంతోపాటు చుట్టూ ఉన్న సమాజానికి ఉపయోగిస్తే ఆ జీవితానికి సార్థకత చేకూరుతుందని నమ్ముతున్నాం. వివేకానందుడి బోధనలతో ప్రేరణ పొందాను. అందుకే ఖాళీ సమయంలో వీవీవైఎంలో పని చేస్తూ వివేకానందుడి బోధనలపై అవగాహన కల్పిస్తున్నాను.

– దొగ్గ మోహనరావు, ఆంధ్రా పెట్రో కెమికల్స్ ఉద్యోగి

### యువత చేతిలోనే దేశాభివృద్ధి



దేశం అభివృద్ధి చెందాలంటే యువతలో దేశ భక్తి పెరగాలి. దేశ భక్తి నిత్య జీవన వేదం కావాలి. సేవ చేయడానికి డబ్బు అవసరం లేదు. అందుకే ప్రతి ఏడాది నిర్వహించే వలంటీర్ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేస్తున్నాను. మా స్నేహితులను కూడా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నాను. యువకులు ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందుకున్నప్పుడే దేశం తొలి స్థానంలో ఉంటుంది. వివేకానందుడి బోధనలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

– బి.నూకరాజు, బర్మా కాలనీ, ఎన్ఎస్‌టీఎల్ కాంట్రాక్ట్ ఉద్యోగి

## క్లుప్తంగా

### మాధవుని సన్నిధిలో వైభవంగా పూజలు


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మద్రిపాలెం: ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీ లీలా మాధవస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘమాసం రెండో ఆదివారం మాఘ మాస వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయంలో అర్చకులు పూజలు చేశారు. జలధార వద్ద భక్తులు పుణ్య స్నానమాచరించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదం స్వీకరించారు. కంచరపాలెం సీఐ రవికుమార్, ఎస్.రవికుమార్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సనపల బంగార్రాజు అన్నదానం ప్రారంభించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం


మాట్లాడుతున్న ఉదయ్‌భాస్కర్

సీతంపేట : సమాజంలో కుల మతోన్మాదానికి వ్యతిరేకంగా డాక్టర్ జయగోపాల్ ఉద్యమించడమే కాకుండా అనేక రచనలు చేశారని ఉదయభాస్కర్ అన్నారు. ప్రముఖ నాస్తికోద్యమనేత పెరియార్ అవార్డు గ్రహీత డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి సభ భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయగోపాల్ పుస్తకాలతోపాటు సీవీ రచనలను కూడా ప్రమోట్ చేసేవారని గుర్తు చేశారు. జయగోపాల్ ఆశయ సాధనకు ఆయన సతీమణి శారద సహకారం అందించి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ మూఢ నమ్మకాల పట్ల ప్రజలను జాగృతం చెయ్యడంలో జయగోపాల్ పోషించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. ముందుగా జయగోపాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు రవి, సాయి నరేందర్, వేదాంత మౌర్య, వై.నూకరాజు, కొత్తపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

### మత సామరస్యమే శాంతికి మార్గం


మాట్లాడుతున్న రామకృష్ణ శాఖానంద స్వామి

సీతంపేట : మత సామరస్యమే శాంతికి మార్గమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో మత సమైక్యత – ప్రపంచ శాంతి వారోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణా ఆశ్రమం స్వామి కృష్ణ శాఖానంద మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు యుద్ధాలతో సతమతమవుతూ శాంతిని కోల్పోతున్నాయని తెలిపారు. మత సామరస్యం కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఐక్యరాజ్య సమితి శాంతి కోసం కృషి చెయ్యాలని, శాంతి స్థాపనకు మత సామరస్యం దోహదపడుతుందన్నారు. సమావేశంలో సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు, కె.ఎస్.ఎన్.మూర్తి, ఎల్.ప్రజ్ఞాన్, రామేశ్వరి, అబ్దుల్ పాల్గొన్నారు.

### ప్రణాళికతో పార్కు అభివృద్ధి

మురళీనగర్ : పార్కు అభివృద్ధికి సభ్యుల సహకారంతో ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తున్నట్లు వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అన్నారు. ఆయన అధ్యక్షతన పార్కు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో వరప్రసాద్ మాట్లాడారు. కృష్ణుడి విగ్రహ ప్రాంగణం మరింత సుందరీకరించాలని నిర్ణయించారు. ఫౌంటెయిన్‌తో పాటు స్టీల్ రెయిలింగ్ నిర్మాణం, ఇతర పనులు చేపడతామన్నారు. వైశాఖి స్పోర్ట్సు పార్కు, శ్రీవారి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో 23న శ్రీరామ పట్టాభిషేకం, 24న సాయంత్రం గరికిపాటి నరసింహారావు ప్రవచనం నిర్వహిస్తామని, విజయవంతం చేయాలని కోరారు. పార్కు కార్యదర్శి పీవీఎస్ రాజు, ఉపాధ్యక్షులు పల్లా చంద్రమౌళి, సీతిని సత్యనారాయణ, కోశాధికారి ఎం.రామకృష్ణ, రఘురామ్ పాండా, పి.కనకరాజు, కె.మురళీధర్, టీఎస్ఎన్ రాజు, చింతాడ రామారావు, పి.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు, ఎల్‌వీ సుధాకర్, పి.సూర్యనారాయణ, వి.వీరరాఘవయ్య పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న పీఠం పురోహితులు


పువ్వుల అలంకరణలో శ్రీలలితాపీఠం ప్రాంగణం

సీతంపేట : శ్రీలలితాపీఠం 76వ బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో కుర్తాళం పీఠం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ వేదమంత్రాల మధ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి లలితా కామేశ్వరులకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు చేపడతామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే సాయంత్రం 6:30 గంటలకు లలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐ.సుబ్బరామనాయుడు, యశోదమ్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఎర్నిమాంబకు పది వేల పెన్నులతో పూజ


ఎర్నిమాంబ అమ్మవారికి పూజించిన పది వేల పెన్నులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలిసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ద్వాదశి, మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని, ఎర్నిమాంబ అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని దైవ సన్నిధిలో దశ సహస్ర (10 వేలు) కలములతో విశేష పూజలు నిర్వహించినట్లు ఈవో సురేష్‌బాబు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అమ్మవారి పేరుతో ముద్రించిన పెన్నులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రత్యేక ఉచిత దర్శనాలకు అనుమతించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై కఠిన చర్యలు


కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ డీవీ రమణ


కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార : ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తప్పవని ద్వారకా సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై సీరియస్ అయ్యారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- సమాజంలో అల్లర్లు చేయకుండా జీవించాలని ద్వారకా ఎస్ఐ వెంకటరావు సూచించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరుకుమాంబ ఆలయంలో ముగిసిన సంకీర్తనలు


ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో భీష్మ ఏకాదశి పర్వదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన సంకీర్తన ఆదివారం ఘనంగా ముగిసింది. ఆలయ ఈవో జి.వి.రమాభాయి పర్యవేక్షణలో దేవస్థానం ఆవరణలో హరిహర నామ సంకీర్తన ఏకాహ మహోత్సవాన్ని శనివారం వైభవంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. భజన బృందాలు గీతాలాపనలు, సంకీర్తనలు ఆలపించాయి. అర్చకులు జి.శ్రీనివాసరావు హారతి ఇచ్చి సంకీర్తనలను ముగించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పితాని సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముంగమూరి దేవదాసు సేవలు విలువైనవి


ఆల్బమ్ ఆవిష్కరిస్తున్న జాన్ వెస్లీ, తదితరులు

సీతమ్మధార : బైబిల్ మిషన్ సెయింట్ దేవదాస్ చర్చిలో ముంగమూరి దేవదాసు వర్ధంతి సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతమ్మధార, కేఆర్ఎం కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి సంఘ కాపరి మాదే సుకుమార్ సుందర్ అధ్యక్షత వహించారు. ముంగమూరి దేవదాసు 120 సంవత్సరాలు జీవించి క్రైస్తవానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ దేవదాసు రాజమండ్రిలో జన్మించి 90 సంవత్సరాలు లూథరన్ మిషన్ ద్వారా క్రైస్తవ్యానికి సేవలు అందించారని కొనియాడారు. బైబిల్ మిషన్‌ను స్థాపించి దేశవ్యాప్తంగా క్రైస్తవ్యానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. దేవదాసు రాసిన పాటల సంకలనాన్ని మాదే సుకుమార్ వ్యయ ప్రయాసలకు ఓర్చి చక్కని ఆల్బమ్ తయారు చేశారని అభినందించారు. 'ఎవ్వారు గమనింపగలరు' అనే ఆల్బమ్ ఆవిష్కరిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆల్బమ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదే దేవి సుందరమ్మ, చింతపల్లి విజయ్ కుమార్, సునీత, జోనాథన్ ఫెడ్రిక్, జాసన్ సుందర్, పూల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మూడు పీఠాల పండగ


మూడు పీఠాలతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం


దివ్య ప్రసాదం అందిస్తున్న అగ్రపీఠాధిపతులు ఆర్చి బిషప్ పొలిమేర జయరావ్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్రపీఠం ప్రత్యేక పరిపాలనాధికారి (ఆర్చి బిషప్) డాక్టర్ పొలిమేర జయరావ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు ప్రభువు ఇహలోకం నుంచి పరలోకానికి వెళ్లే సమయంలో తాను మానవళి మధ్యలో సజీవంగా ఉండేందుకు గుర్తుగా రొట్టె, ద్రాక్షరసాన్ని ఆశీర్వదించి భుజించమని చెప్పారన్నారు. దివ్య పూజబలిలో సత్ప్రసాదంలోని సాక్షాత్తు క్రీస్తు ప్రభు అంశ ఉంటుందన్నారు. పండగలో భాగంగా సుమారు 120 మంది చిన్నారులు నూతనంగా దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం సాయంత్రం జ్ఞానాపురంలోని వడిచర్ల వీధి, స్లీవ్‌గుర్తు మండపంలో, పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఏర్పాటు చేసిన పీఠాల వద్ద దివ్య సత్ప్రసాద ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండగ వాతావరణంతో పవిత్ర హృదయంతో జరిగిన పాదయాత్రలో నగరం నలుమూలల నుంచి అనేక మంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశాఖ ఆర్చి ప్రత్యేక పాలనాధికారి బిషప్ పొలిమేర జయరావ్ మాట్లాడుతూ వాటికన్ నుంచి పోప్ ఫ్రాన్సిస్ ద్వారా వచ్చిన వర్తమానాన్ని ఈ సందర్భంగా విశాఖ నూతన అగ్రపీఠం ఆర్చిబిషప్‌గా డాక్టర్ ఉడుముల బాల నియమితులైనట్లు జయరావ్ తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, ఫాదర్ వినయ్‌కుమార్, ఫాదర్ వేళంగిణీరాజు, సుమారు 150 మంది గురువులు, కన్య స్త్రీలు, ఆలిండియా కేథలిక్ యూనియన్ సభ్యులు, పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

## 24న ఉమా నీలకంఠేశ్వర కల్యాణోత్సవం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల ఉమా నీలకంఠేశ్వర స్వామి వార్షిక కల్యాణం, మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. దేవస్థానంలో కల్యాణ మహోత్సవాలు ఈ నెల 24న అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.300 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 26న బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిస్తామని తెలిపారు. రాత్రి 10 గంటలకు సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు.

## లతా మంగేష్కర్‌పై దృశ్యమాలిక ప్రదర్శన


ఫణీంద్రుడిని సత్కరిస్తున్న చంద్రశేఖర్, రఘురామారావు

సీతంపేట : భారతరత్న గానకోకిల లతామంగేష్కర్ తృతీయ వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఫణీంద్రుడు వడ్లమాని రూపొందించిన దృశ్యమాలిక ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లతామంగేష్కర్ జీవిత విశేషాలతో రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రఘురామారావు మాట్లాడుతూ యావత్ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన గాయనీమణి లతామంగేష్కర్ అని కొనియాడారు. ఆరు దశాబ్దాలపాటు 30కిపైగా భాషల్లో వేలాది పాటలు పాడి చిత్ర పరిశ్రమలో తనదైన చెరగని ముద్ర వేశారన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి భారత ప్రభుత్వం భారతరత్నతో సత్కరించిందని, ఉత్తమ గాయనిగా ఎన్నో ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారన్నారు. లతామంగేష్కర్ సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎంతో విలువైన, అరుదైన వీడియోలు, పాటలు, ప్రసంగాలు, అవార్డులు అందుకున్న అద్భుత క్షణాల వీడియోలను సేకరించి దృశ్యమాలిక రూపొందించిన ఫణీంద్రుడిని అభినందించారు. ఈ సందర్భంగా విశాఖ మ్యూజిక్ అకాడమి మేనేజింగ్ ట్రస్టీ వి.చంద్రశేఖర్ చేతుల మీదుగా దృశ్యమాలిక రూపకర్త ఫణీంద్రుడుని ఘనంగా సత్కరించారు.